క్లుప్తంగా

విద్యార్థి మిత్ర కిట్‌ల పంపిణీ



రాంపురం ప్రాథమిక పాఠశాలలో కిట్‌లు అందిస్తున్న రెడ్డి నారాయణరావు

పెందుర్తి: మండల పరిధిలోని రాంపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లను జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బ్యాగ్‌లు, పుస్తకాలు, ఇతర సామగ్రి అందించారు. హెచ్‌ఎం కళావతి, ఎస్ఎంసీ చైర్మన్ సంతోషి, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ల పంపిణీ



చెక్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వారికి సీఎం సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) నుంచి వచ్చిన చెక్‌లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అందించారు. బుధవారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని మొత్తం 13 మందికి రూ.6.70 లక్షల విలువైన చెక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరును బాగుచేయండి



మరమ్మతులకు గురైన బోర్‌వెల్

పెందుర్తి: 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని ద్రోణంరాజునగర్‌లో తాగునీటి బోర్‌వెల్ మరమ్మతులకు గురైంది. 10 రోజుల క్రితం బోరు పాడైనా జీవీఎంసీ అధికారులు దీన్ని బాగు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్పందించి బోర్‌వెల్‌ను బాగుచేయాలని కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

24న బంగారమ్మ పండగ



బంగారమ్మ జోగిని ఊరేగింపు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత బంగారమ్మతల్లి పండగ మహోత్సవం ఈ నెల 24న జరగనుంది. ఈ మేరకు బుధవారం గ్రామంలో అమ్మవారి జోగి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజారి వంశీయులు జోగిని శిరస్సుపై పెట్టుకుని పాత అడవివరంలోని బంగారమ్మ సతకంపట్టు నుంచి ప్రియాగార్డెన్స్‌లోని ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు జోగిని దర్శించుకున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. దీంతో శుక్రవారం ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సబ్‌స్టేషన్ పరిధి గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, మొగలిపురం, బోదువలస, అయ్యన్నపాలెం, వంగలి, రాయపుర అగ్రహారం, టిక్కలిపాలెం, నాయనమ్మపాలెం, ఆరిపాక, గొటివాడ, పెదయాతపాలెం, బంగారమ్మపాలెం, అద్దూరు, ఎల్లుప్పి, లగిశెట్టిపాలెం, గాలిభీమవరం, చినయాతపాలెం, కిల్లివానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

సింహగిరుల్లో.. సాగు అనాసక్తి!



ఎన్నో పుట్టుధారలకు నిలయమైన సింహగిరి కొండల్లో పండే అనాస (పైనాపిల్) రుచే వేరు. అందుకే ఇక్కడి అనాసకు ఎంతో డిమాండ్. ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు సింహగిరి అనాస పండ్లు కనువిందుచేసేవి. సింహాచలం పరిసర ప్రాంతాల్లో గుట్టలుగా పోసి విక్రయించేవారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పెద్ద ఎత్తున వాటిని కొనుగోలు చేసేవారు. అప్పట్లో విరివిగా లభించే వీటిని ఇతర ప్రాంతాలకూ ఎగుమతి చేసేవారు. అలాంటిది ఇప్పుడు ఇతర ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన అనాస పండ్లను సింహాచలంలో విక్రయిస్తున్న పరిస్థితి నెలకొంది.

- సింహాచలం అనాస రుచులు ఇక గతం
- ఒకప్పుడు గుట్టలుగా పోసి విక్రయాలు
- నేడు కనీస స్థాయిలోనూ కనపడని వైనం
- వీటి సాగువల్లే పైనాపిల్ కాలనీ **పేరు!**

సింహాచలం: ఎంతో ప్రసిద్ధి చెందిన సింహగిరి అనాస(పైనాపిల్) రాన్రాను కనుమరుగవుతోంది. ఒకప్పుడు సింహగిరి కొండల్లో అనాస పండేదట.. ఎంతో తియ్యని రుచితో ఉండేదట.. అని రానున్న రోజుల్లో మన పిల్లలు చెప్పుకునే పరిస్థితి నెలకొంది. ఏడేళ్ల కోసారి పంట భూమిని మార్చాల్సి రావడం, కూలి ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని సింహగిరి రైతులు ఆవేదనతో చెప్తున్నారు.

మూడేళ్లకు కాపు.. ఏడేళ్లకు భూ మార్పు

అనాస పంట వేసిన మూడేళ్లకు చేతికొస్తుంది. ఈ ఏడాది నారు నాటితే వచ్చే ఏడాది కాకుండా ఆ వచ్చే ఏడాది పంట చేతికొస్తుంది. తొలిసారి ఒక కాయ మాత్రమే కాస్తుంది. ఆ తర్వాత మొక్క నుంచి పక్కన పిలకలు వచ్చి రెండు కాయలు కాస్తుంది. అలా వచ్చే పిలకల ఆధారంగా కాయల సంఖ్య పెరుగుతుంది. ఏడేళ్ల మాత్రమే పంట వస్తుంది. ఆ తర్వాత ఆ భూమిలో సారం తగ్గి పంటకు అనుకూలించదు. దీంతో ఆ స్థలాన్ని అలానే వదిలేసి, మరో స్థలాన్ని వెతుక్కోవాలి.



అనాస పండిన ప్రాంతంలో ఇప్పుడు ఉన్న జీడి చెట్లు

అనాస పోయె.. జీడి వచ్చె!

అప్పట్లో అనాస పంట వేసిన కొండ అంతటా ప్రస్తుతం జీడి, పనస చెట్లే కనిపిస్తున్నాయి. ఏడేళ్ల తర్వాత అనాస పంటకు ఆ భూమి సహకరించకపోవడంతో రైతులంతా జీడి సాగుకు మళ్లారు. మరో చోట వేయాలంటే దేవస్థానం కొండ కావడం, అప్పటికే ఇందిరమ్మ పేరిట ఇచ్చిన భూములు కూడా దేవస్థానానికి చెందిన గ్రీన్‌బెల్ట్‌గా ప్రకటించడంతో చాలా మంది రైతులకు కష్టాలు మొదలయ్యాయి. మరోవైపు అనాస సాగులో నష్టాలు, కూలి ఖర్చు భారమవడంతో రైతులు ఈ పంటల సాగును విరమించుకున్నారు.

వర్షాధారం.. ఎంతో కష్టం

రైతులు అనాస పండించేందుకు కొండల్లోకి ఉదయం వెళ్తే తిరిగి సాయంత్రానికే ఇంటికి వచ్చేవారు. పూర్తిగా వర్షాధారం. అనాస సాగుకు కొండపై తుప్పల్ని, పిచ్చి మొక్కల్ని తొలగించి, స్థలాన్ని సిద్ధం చేసేందుకు చాలా కష్టపడాలి. నారు వేయడం, గొప్పుతవ్వడం తదితర పనులు చేసేవారు. అడవిపందుల బారిన పడకుండా పంటను కాపాడుకునేందుకు నిరంతర కాపలా తప్పనిసరి. ఇంతచేసినా ఒక్కో ఏడాది దిగుమతి సరిగా రాకపోవడం, అడవి పందులు పంటలను నాశనం చేయడంతో కష్టం వృథాగా మారిన సంఘటనలెన్నో..!



సింహగిరి కొండల్లో పండిన అనాస(ఫైల్)



పైనాపిల్ కాలనీ ఏర్పడిందిలా..

సింహగిరి కొండల్లో రైతులు దేవస్థానం వద్ద శిస్తు కట్టి తీసుకున్న స్థలంలో అనాసను పండించేవారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఈ కొండల్లో సుమారు 250 ఎకరాలను(కొండ, కొండవాలు కలిపి) సన్నకారు రైతులకు అందించారు. ఒక్కొక్కరికి ఎకరం పొలంతో పాటు, ఒక ఇల్లు చొప్పున కేటాయించారు. అదే ఇప్పుడు సింహాచలం నుంచి హనుమంతవాక దారిలో ఉన్న పైనాపిల్ కాలనీగా పేరుగాంచింది. పేద రైతులంతా ఇక్కడ ఉంటూనే సమీపంలో ఉన్న కొండల్లోకి వెళ్లి అనాసను పోడు వ్యవసాయంగా సాగుచేసేవారు.

ఏడేళ్లు సాగు చేశా..



నేను ఏడేళ్లపాటు అనాస సాగుచేశా. అప్పట్లో ఇందిరమ్మ ఇచ్చిన మొత్తం 250 ఎకరాల్లోనూ రైతులు అనాస సాగుచేసేవారు. ప్రస్తుతం జీడి చెట్లు కనిపిస్తున్న కొండంతా అప్పట్లో అనాస తోటలే ఉండేవి. ఎస్.కోటకు ఇక్కడి నుంచే పెద్ద ఎత్తున అనాసపళ్లు పంపించేవాళ్లం. ఏడేళ్ల తర్వాత భూసారం తగ్గి, అనాస పంటకు ఆ భూమి పనిచేయదు.

– బంధం లక్ష్మణరావు, రైతు, పాత అడవివరం

కూలీలు కూడా దొరకట్లేదు



కొండల్లోకి వెళ్లి అనాస పండించేందుకు కూలీలు కూడా దొరకడం లేదు. దానికితోడు దిగుమతి అంతంతమాత్రమే. అప్పట్లో మూడు రూపాయల కూలీకే పనిచేసేవారని మాపెద్దలు చెప్పేవారు. ఇప్పుడు రోజుకు రూ.వెయ్యి ఇచ్చినా కూలీలు రావట్లేదు. దీనికి తోడు అడవిపందుల బెడద ఎక్కువ. పెట్టుబడికి సరిపడా రాబడి కూడా రానిపరిస్థితి.

– సూరిబాబు, రైతు, సింహాచలం



ఒకప్పుడు అనాస పండించిన సింహగిరి కొండలు

అప్పట్లో గుట్టలుగా విక్రయాలు



ఏటా జీడి, పనస వ్యాపారం చేస్తుంటాం. అప్పట్లో సింహాచలానికి చెందిన అనాస పండ్లు గుట్టలుగా పోసి విక్రయాలు జరిపిన పరిస్థితి ఉండేది. చాలామంది ఇక్కడి అనాస కోసం ప్రత్యేకంగా వచ్చి, కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చాలామంది సింహాచలం కొండపై పండే అనాస లేదేం.. అంటూ అడుగుతున్నారు.

– వరలక్ష్మి, వ్యాపారి, సింహాచలం

ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర

- పెందుర్తి నుంచి భారీ జన సమీకరణ
- యోగాంధ్ర పెందుర్తి కో ఆర్డినేటర్ దేవినేని ఉమ



సమీక్షలో పాల్గొన్న మంత్రి డోలా, మాజీ మంత్రి దేవినేని ఉమ, కూటమి నాయకులు

పెందుర్తి: అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని, విజయవంతం చేయాలని యోగాంధ్ర పెందుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సుజాతనగర్లోని ఓ కల్యాణ మండపంలో యోగాంధ్రపై నియోజకవర్గ స్థాయి సమీక్ష బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాల్గొనే ఈ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ నియోజకవర్గం నలుమూలల నుంచి భారీ ఎత్తున ప్రజలు యోగాంధ్ర కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి, మేయర్ పీలా శ్రీనివాసరావు, కోడూరు ఎమ్మెల్యే సునీల్, గుంటూరు నగర కమిషనర్ శ్రీనివాసరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

‘మొల్లోడుగెడ్డ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి’



మొల్లోడుగెడ్డ వద్ద మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: మండలంలోని భర్నికం మొల్లోడు గెడ్డలో వ్యర్థ రసాయనాలు విడుదల చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీవోడీ లెవల్స్ 270 దాటి తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతూ భూగర్భ జలాల నాశనానికి ఫార్మా పరిశ్రమలు కారణమవుతున్నాయని ఆరోపించారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసి, సముద్ర జలాల్లో విడిచి పెట్టాల్సిన యాజమాన్యాలు నిబంధనలను ఉల్లంఘించి ఇష్టానుసారంగా భర్నికం మొల్లోడు గెడ్డలో విడిచిపెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్నారు. ఫార్మా యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసినట్లు పేర్కొన్నారు. ఫార్మా రసాయనాలను గెడ్డలో విడిచిపెట్టడంతో భర్నికం ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గెడ్డలో నిలిచిన వ్యర్థ రసాయనాలతో కూడిన నీటిని తాగిన పశువులు, ఆ నీరు చేరిన పొలాల్లో పంటలు నాశనమవుతున్నాయని ఆక్షేపించారు. దీనిపై పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టకపోతే ప్రజా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఒకరి అరెస్ట్



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మండలంలో గొర్లివానిపాలెం బీసీ కాలనీకి చెందిన గొర్లి దేవి మెడలో పుస్తెల తాడు లాక్కెళ్లిన కేసులో పరవాడ పోలీసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు బుధవారం మీడియాతో మాట్లాడుతూ, తెలిపిన వివరాలు..

గొర్లివానిపాలేనికి చెందిన గొర్లి దేవి మార్చి 12న బీసీ కాలనీ వీధిలో నడిచి వెళ్తుండగా వెనుక నుంచి స్కూటీపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న 5 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. దేవి ఫిర్యాదు మేరకు పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి బుధవారం కూర్మన్నపాలెం కూడలిలో దొంగతనానికి పాల్పడిన బొండా అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దొంగిలించిన పుస్తెలతాడును ఓ గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టినట్లు గుర్తించామన్నారు. పుస్తెలతాడుతోపాటు, చోరీకి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరుణ్‌కుమార్‌పై గతంలో అనందపురం, సబ్బవరం, ఉయ్యూరు టౌన్ పోలీస్ స్టేషన్లలో మూడు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో మోటారు సైకిల్ దొంగతనం కేసు నమోదయ్యాయి. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో షీట్ ఓపెన్ చేశారని చెప్పారు. మహిళలు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మల్లికార్జునరావు సూచించారు. సమావేశంలో ఏఎస్ఐ బి.వై.నాయుడు, హెడ్ కానిస్టేబుల్ సాయిసంతోష్, క్రైం కానిస్టేబుల్ జీఎస్ఎస్‌వీ నాయుడు పాల్గొన్నారు.

అసంపూర్తిగా.. రైతు సేవా కేంద్రం



అర్ధంతరంగా నిలిచిన రైతు సేవా కేంద్రం

పరవాడ: మండల కాంప్లెక్స్ వద్ద రూ.21.08 లక్షలతో చేపట్టిన రైతు సేవా కేంద్రం పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు తదితర సేవలు అందుబాటులో ఉండేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రెండేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. బిల్లుల జాప్యం కారణంగా భవన నిర్మాణానికి పూనుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులను చివరి దశలో వదిలేశారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేసినప్పటికి ద్వారాలు, కిటికీలు, గచ్చులు, పెయింటింగులు, విద్యుత్ పనులు మిగిలి ఉన్నాయి. వీటిని పూర్తి చేస్తే రైతులకు అవసరమైన సేవలన్నీ ఇక్కడ అందించవచ్చు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా.. నిధుల మంజూరుకు చొరవ చూపని పరిస్థితి. దీంతో భవనం చుట్టూ పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. సత్వరమే నిర్మాణాన్ని పూర్తి చేసి, సేవల్ని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

రేపటి నుంచి గాయత్రి ఆలయ వార్షికోత్సవాలు



పంచముఖ గాయత్రిమాత

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని శ్రమశక్తినగర్లో కొలువుదీరిన పంచముఖ గాయత్రిమాత ఆలయ 15వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్త సరస్వతుల నరసింహమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ఉదయం సుప్రభాత సేవ, కలశాభిషేకం, అలంకరణ, సర్వదర్శనం, వేద పారాయణం, లలితా సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం, ప్రసాద వితరణ, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రెండవ రోజు శనివారం సుప్రభాత సేవ, లలితా సహస్ర నామార్చన, అష్టోత్తర శతనామ పారాయణ, హనుమాన్ చాలీసా, సాయంత్రం ఊయల సేవ, దీపాలంకరణ, గాయత్రీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. చివరి రోజైన ఆదివారం పారాయణాలు, పూజలతోపాటు, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులంతా వేడుకల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

‘యోగాంధ్ర’లో పాల్గొనేవారికి 11 చోట్ల వసతి



సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఐతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

సబ్బవరం: విశాఖ నగరంలో ఈ నెల 21న ప్రధాని మోదీ పాల్గొనే ప్రపంచ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు రానున్న యోగా సాధకులు 3,110 మందికి సబ్బవరంలో వసతి ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా వివిధ కళాశాలలు, పాఠశాలలు, కన్వెన్షన్ హాళ్లలో ఏర్పాట్లను సీఐ రామచంద్రరావుతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం, చీడికాడ, కోటపాడు మండలాల నుంచి 20వ తేదీన వచ్చే వారి కోసం మండలంలో 11 చోట్ల బస ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజు రాత్రికి భోజనాలు, 21న ఉదయం స్నాక్స్ అందిస్తామన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో డీటీ సీహెచ్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

యోగాంధ్రపై విద్యార్థులకు అవగాహన



అవగాహన ర్యాలీలో విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వడిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమంపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం యోగాపై అవగాహన కల్పించారు. జాతీయ స్థాయి యోగా విజేత పండూరి జయలక్ష్మి ఆధ్వర్యంలో కొన్ని ఆసనాలను విద్యార్థులకు నేర్పారు. వాటి ప్రాధాన్యత, ఆసనాలు వేసే విధానాన్ని వివరించారు. అనంతరం కళాశాల నుంచి సబ్బవరం వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. యోగా ప్రాధాన్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ రత్నప్రకాష్, ఎంవీ రామకృష్ణ, లక్ష్మి, గోవిందరావు, జాతీయ సేవా సమితి ప్రోగ్రాం అధికారి లెక్కల గణేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు మెరుగైన ఆదాయం



పెదగాడిలో పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎన్ఆర్ఎల్ఎం మేనేజర్ రాజీవ్

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) మేనేజర్ రాజీవ్ సింఘాల్ సూచించారు. ఇంట్లోనే చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చన్నారు. పెందుర్తి మండలం పెదగాడికి చెందిన ఎం.గౌరీప్రసన్న పీఎంఈజీపీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసుకున్న పేపర్ ప్లేట్ల యూనిట్‌ను రాజీవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఉపాధి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తోందన్నారు. దీని ద్వారా మహిళలు తాము స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరి కొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవచ్చన్నారు. పథకాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్ఈఆర్‌పీ అడిషనల్ డైరెక్టర్ కె.సరళ, ఎన్ఆర్ఎల్ఎం బృంద సభ్యులు విజయ్‌కుమార్, వైదేహి, సత్యంనాయుడు, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

ప్రజలు సురక్షితంగా ఇళ్లకు చేరేలా చర్యలు

యోగాంధ్రపై మహిళా పోలీస్‌లతో సీఐ సతీష్‌కుమార్ సమీక్ష



మాట్లాడుతున్న పెందుర్తి సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు వెళుతున్న ప్రజలను తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేరేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని సీఐ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో వార్డు/గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో యోగాంధ్రపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరంలోని బీచ్‌లో జరిగే యోగాంధ్రకు జూన్ 20 రాత్రి నుంచే పెందుర్తి ప్రాంతంలోని సచివాలయాల వారీగా నగరంలోని బీచ్‌కు తరలివెళ్లే వాహనాలు, ప్రజల సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం అర్ధరాత్రి(తెల్లవారితే శనివారం) ఒంటి గంట నుంచి ప్రతి 30 నిమిషాలకు ఒకసారి పోలీస్ స్టేషన్‌కు జరిగే ప్రతి అంశంపై నివేదికను క్రమం తప్పకుండా అందించాలన్నారు. మహిళా పోలీసులు విధుల్లో బాధ్యతగా వ్యవహరించి పోలీస్ స్టేషన్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వాహనాలు, ప్రజలు ఎక్కడ తప్పిపోయినా వారిని గుర్తించేందుకు ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్ నెంబర్ సేకరించాలన్నారు. పలు సూచనలు సలహాలు అందించారు. సమీక్షలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఛిద్రమైన రోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది



ఛిద్రమైన రోడ్డు మీదుగానే వర్సిటీలోని నిర్మాణాలకు మెటీరియల్ తరలిస్తున్న లారీ

సబ్బవరం: మండలంలోని చోడవరం రోడ్డు నుంచి ఆరిపాక మీదుగా వెళ్లే రాయపుర అగ్రహారం బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. కనీసం గోతులు పూడ్చేందుకైనా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంగలి గ్రామంలోని ఇండియన్ ఇనిస్టిస్యూట్ అఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీతో పాటు మారిటైం యూనివర్సిటీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో భవన నిర్మాణాలకు సంబంధించిన ముడి సరకు, భారీ యంత్రాలు ఈ రోడ్డు మీదుగానే తరలిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. భారీ వాహనాలు గోతుల్లో పడి నిలిచిపోవడంతో పాటు అదుపు తప్పి బోల్తా పడేలా ఉన్నాయి. దీంతో డ్రైవర్లు, ప్రయాణికులు భయంభయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధ్వానంగా మారిన ఈ రోడ్డును త్వరితగతిన అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.